క్లుప్తంగా

తల్లుల పేరుతో మొక్కల పెంపకం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): అంగన్‌వాడీ చిన్నారులు తమ తల్లుల పేరుతో కనీసం ఒక మొక్క అయినా నాటి సంరక్షించాలని ఐసీడీఎస్ ఈలప్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ జి.రమాదేవి అన్నారు. కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమాల్లో పుట్లమ్మగట్టు అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లుల పేరు మీద మామిడి మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ చెట్లు లేని ప్రపంచాన్ని ఊహించడం చాలా కష్టమన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుచేశారు. చెట్లు పర్యావరణాన్ని కాపాడతాయని, వృక్ష సంపద తగ్గిపోతే ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయని చెప్పారు. పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కోడింగ్ నైపుణ్యం పెంపొందాలి



మైలవరం: అధ్యాపకులు, విద్యార్థులు కోడింగ్ నైపుణ్యం పెంపొందించుకోవాలని బ్రిజ్‌ట్రాన్ సాఫ్ట్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు ఆర్.అభిషేక్, కె.కిరణ్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ, సీఎస్‌ఎం, ఏఐ అండ్ డీఎస్ విభాగాల ఆధ్వర్యంలో మెర్న్‌ఫుల్ స్టాక్ టెక్నాలజీ అంశంపై తృతీయ సంవత్సరం విద్యార్థులకు, అధ్యాపకులకు మూడు వారాల శిక్షణా కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ నానాటికీ ఐటీ ఇండస్ట్రీలో కొత్తగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. మెర్న్‌ఫుల్ స్టాక్ టెక్నాలజీలో వివిధ అంశాలపై మూడు వారాలు నిర్వహించిన శిక్షణ వల్ల విద్యార్థులు వారు నేర్చుకున్న అంశాలకు వివిధ అప్లికేషన్స్ డెవలప్‌మెంట్ చేయగలిగారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఆయా విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్య లక్ష్యం



తిరువూరు: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ట్యూషన్ పాయింట్లను ఉచితంగా నిర్వహిస్తున్నామని విశ్వమానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు మస్తాన్‌రావు అన్నారు. స్థానిక సుందరయ్య కాలనీలో జన విజ్ఞాన వేదికతో కలిసి ఏర్పాటు చేసిన ఉచిత ట్యూషన్ పాయింట్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తిరువూరు పట్టణంలోని శివారు ప్రాంతాలైన భగత్‌సింగ్ నగర్ కాలనీ, రాజుపేట, పీటీ కొత్తూరులలో కూడా ట్యూషన్ పాయింట్లను ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, స్థానిక ప్రతినిధులు పాపారావు, హరికృష్ణ, సుబానీ, సుధాకర్, నాగేంద్రప్రసాద్, రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కట్టలేరుపై రాకపోకలు నిలిపివేత



గంపలగూడెం: వరద నీటి ఉధృతి కారణంగా మండలంలోని కట్టలేరుపై రాకపోకలను అధికారులు నిలిపి వేశారు. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు కట్టలేరులో మండలంలోని తోటమూల-వినగడప గ్రామాల నడుమ వంతెన వద్ద వరద నీరు గాడినిండా పారుతోంది. వరద ప్రవాహం గంటగంటకు పెరుగుతోంది. కట్టలేరు వంతెన ధ్వంసం అయిన నేపథ్యంలో రాకపోకలకోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రహదారి అంచులు తాకుతూ నీరు పారుతోంది. తహసీల్దార్ సుగుణ, ఎస్‌ఐ ఎస్.శ్రీను వంతెన వద్ద వరద ఉధృతిని పరిశీలించి ముందస్తు జాగ్రత్తగా రాకపోకలను నిలిపివేశారు. ఏటికి ఇరువైపులా గంపలగూడెం–నూజివీడు రహదారిపై కంచె ఏర్పాటు చేసి తగిన బందోబస్తు చేశారు. వరద ఉధృతి తగ్గేవరకు ప్రజలు ఎవ్వరూ ఇటువైపు ప్రయాణం చేయవద్దని వారు సూచించారు.

పోషకాల పశుగ్రాసంతో మేలు

- అధిక పాల దిగుబడికి అవకాశం
- పశువుల ఆరోగ్యానికి దోహదం



ఎన్.రమణారావు

నూజివీడు: పాల ఉత్పత్తి గణనీయంగా పెరగాలంటే అధిక పోషకాలున్న పశుగ్రాసం ఎంతో అవసరం. సహజంగా పశుగ్రాసం అంటే రైతులకు వెంటనే గుర్తొకొచ్చేది వరిగడ్డి, పచ్చగడ్డి. వరిగడ్డిలో పోషకాలు చాలా తక్కువగా ఉండటమే కాకుండా జీర్ణం కాని భాగం ఎక్కువ ఉంటుంది. పచ్చగడ్డి మంచి పశుగ్రాసమే కాని అందులో కొన్ని రకాలు వాడితే పశువులకు అధిక పోషకాలున్న ఆహారం అందడమే కాకుండా పాల దిగుబడి ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పశుగ్రాసాల గురించి రైతులలో అవగాహన కల్పించేందుకు పట్టణంలో పశువుల ఆస్పత్రి ఏడీ డాక్టర్ ఎన్.రమణారావు పలు సూచనలు చేశారు. పశుగ్రాసాలు నాలుగు రకాలున్నాయి. వాటిని ధాన్యపు జాతి, కాయజాతి, గడ్డిజాతి, చెట్లు రకాలుగా విభజించారు. వీటిలో ధాన్యపు జాతి పశుగ్రాసాలు ఎక్కువ పోషకాలను కలిగి ఉంటాయి. వీటిల్లో ముఖ్యమైనవి..

స్వీట్ సూడాన్ గ్రాస్ రకం జొన్న

ఇది జొన్న రకానికి చెందిన పశు గ్రాసం. ఏపుగా, ఎత్తుగా పెరిగి అధిక పశుగ్రాసాన్ని ఇస్తుంది. ఖరీఫ్ సీజన్‌లో 80 శాతం పచ్చిమేత అవసరాలను ఈ రకం పశు గ్రాసం తీరుస్తుంది. ఇది తక్కువ వర్షపాతం గల ప్రాంతాలలో సాగు చేసుకునేందుకు అనువుగా ఉండటంతోపాటు మూడు నుంచి నాలుగు కోతలు వస్తుంది. ఈ రకాన్ని జనవరి నుంచి ఆగస్టు వరకు నాటుకోవచ్చు. వర్షా కాలంలో నీటి తడులు ఇవ్వాల్సిన పని లేదు.



పశుగ్రాసం

హైబ్రిడ్ నేపియర్

ఈ గడ్డి ఎక్కువ పరకలతో ఎక్కువ ఆకులు కలిగి రుచికరంగా ఉంటుంది. నీటి పారుదల గల అన్ని భూములలో ఏడాది పొడవునా ఈ పశుగ్రాసం సాగు చేసుకోవచ్చు. చవుడు, ఇసుక నేలలు, నీరు నిలిచే పల్లపు భూములు తప్ప అన్ని భూములలో సాగు చేయవచ్చు. వర్షాకాలం ప్రారంభ దశలో జూన్, జూలైలలో నాటుకుంటే పశు గ్రాసాన్ని అందుబాటులోకి తెచ్చుకోవచ్చు. నాటిన 70, 75 రోజులకు మొదటి కోత కోసి పశు గ్రాసంగా వాడుకోవాలి. తరువాత ప్రతి 40 రోజులకో సారి కోతకు వస్తుంది. ఈ పశు గ్రాసాన్ని ఒకసారి నాటితే 4 సంవత్సరాల వరకు ఉపయోగించుకోవచ్చు. ఏడాదికి ఎకరాకు 60 నుంచి 70 టన్నుల పశు గ్రాసం దిగుబడి వస్తుంది.

లూసర్న్ రకం..

దీనిని ఏక వార్షిక, బహు వార్షిక పశుగ్రాసాలుగా సాగు చేసుకోవచ్చు. మాంసకృత్తులు, కాల్షియం అధికంగా ఉండి పచ్చిమేతగా, ఎండుమేతగా కూడా ఉపయోగించుకోవచ్చు. అన్ని రకాల సారవంతమైన భూములలో సాగు చేయవచ్చు. ఎకరాకు 6 నుంచి 8 కిలోల విత్తనాలను వేయాలి. మొదటిసారి విత్తేటప్పుడు బాక్టీరియా కల్చర్‌తో కలిపి విత్తడం మంచిది. అక్టోబర్ నుంచి నవంబర్ మధ్య దీనిని నాటుకునేందుకు అనువైన సమయం. విత్తిన 70 రోజుల తరువాత మొదట కోతకు వస్తుంది. తరువాత ప్రతి 25 రోజుల వ్యత్యాసంతో ఆరేడు కోతలు కోయవచ్చు. 24 టన్నుల వరకు ఎకరాకు దిగుబడి వస్తుంది.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

ఎస్‌ఈబీ తిరువూరు ఎస్‌ఐ అశోక్

తిరువూరు: విద్యార్థులు మత్తుపదార్థాల జోలికి పోవద్దని, వాటి బారిన పడినవారు జీవితాన్ని నాశనం చేసుకోక తప్పదని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తిరువూరు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్ అన్నారు. స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. గంజాయి, హెరాయిన్, బ్రౌన్‌షుగర్ వంటి మత్తు పదార్థాలు క్రమేపీ వ్యక్తులను శారీరకంగా, మానసికంగా కృంగదీస్తాయని, వీటి కారణంగా అనారోగ్యానికి గురైనవారు తిరిగి కోలుకోవడం కష్టమన్నారు. సమాజంలో మత్తు పదార్థాలకు బానిసలైన వారిని ఎవరూ గౌరవించరని, కుటుంబం కూడా వారిని వెలివేస్తుందని అశోక్ చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, ఎస్‌ఈబీ ఎస్‌ఐ జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ అశోక్

బెల్లపు ఊట ధ్వంసం

విస్సన్నపేట మండలంలో ఎస్‌ఈబీ అధికారులు శనివారం విస్తృత దాడులు నిర్వహించారు. సారా అమ్మకాలు నిర్వహిస్తున్న బాణావత్ నాగమణిని అదుపులోకి తీసుకుని ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. వంద లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

జీపీఎస్ జీవోను రద్దు చేయాలి

- జీవో ప్రతులను దగ్ధం చేసిన యూటీఎఫ్ నాయకులు
- ఓపీఎస్ పునరుద్ధరణకు డిమాండ్

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రప్రభుత్వం ఈనెల 12వ తేదీన పాత తేదీతో జీపీఎస్‌ను అమలుచేస్తూ విడుదల చేసిన జీవో నంబర్ 54ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జగ్గయ్యపేట మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక టీచర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ భవన్ వద్ద యూటీఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు జీవో నంబరు 54 ప్రతులను దగ్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం పాత తేదీతో జీపీఎస్‌ను అమలు చేస్తూ విడుదల చేయడం తగదన్నారు. జీవో నెంబర్ 54 ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎం.కృష్ణయ్య, జి.పల్లవి, జి.ముక్తేశ్వరరావు, కె.హనుమంతరావు, సీహెచ్‌ఎస్ఎన్ మూర్తి, ఎ.నరసింహారావు, ఎండీ.మునీర్ బాషా, ఎం.పరమేశ్వరరావు, ఎం.దేవదానం, కె.విజయలక్ష్మి, ఎస్.గంగాధరరావు, వీవీ.సుబ్బారావు, కె.సాయి శ్రీనివాసరావు, టి.జయసుధ, వి.దుర్గాప్రసాద్, ఎస్వీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా చర్యలు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

చంద్రాల(మైలవరం): గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా సర్పంచ్‌లు, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని అన్నారు. మైలవరం మండలం కీర్తిరాయునిగూడెం, పోరాటనగర్‌లో జ్వరం కేసులు నమోదు అయిన నేపథ్యంలో స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 9 వైద్య బృందాలు ఇంటింటి సర్వే ద్వారా 367 ఇళ్లను సందర్శించి 1,356 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లోని డ్రెయినేజీలలో దోమల లార్వాను గుర్తించారు. పరిసరరాల్ల బ్లీచింగ్ చల్లించారు. డాక్టర్ సుహాసినీ మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. మండల అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు మాట్లాడుతూ సిబ్బందికి, సర్పంచ్‌లకు, గ్రామ పెద్దలకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ, సబ్ యూనిట్ అధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని



ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ కాన్పుల గదిలో సదుపాయాలపై ఆరాతీస్తున్న డీఎంహెచ్‌ఓ

అప్రమత్తంగా ఉండాలి..

ఇబ్రహీంపట్నం: వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎం.సుహాసిని వైద్యాధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణ తనిఖీలో భాగంగా ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాన్పుల గదిని పరిశీలించారు. అక్కడ తల్లీబిడ్డల ఆరోగ్యంపై ఆరా తీశారు. వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. రోగుల విషయంలో వైద్య సిబ్బంది అనుసరిస్తున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మొక్కుబడిగా ప్రజలకు అవగాహన కల్పించడం కాకుండా వ్యక్తిగతంగా కూడా ఫ్రైడే డ్రైడే నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా, దోమల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశాలు, ఏఎన్‌ఎంలకు దిశానిర్దేశం చేశారు. డాక్టర్ పర్వీన్, సీహెచ్‌ఓ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

• జై జగన్నాథస్వామి..



జగన్నాథస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయవాడ 16వ డివిజన్‌లోని ఇస్కాన్ మందిరంలో జగన్నాథస్వామిని అధిక సంఖ్యలో భక్తులు శనివారం దర్శించుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. భక్తులకు మందిర నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం రష్యా, ఉక్రెయిన్ దేశానికి చెందిన భక్తులు ప్రత్యేకంగా ఆలపించిన కీర్తనలు అలరించాయి. విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. 200 రకాల పిండి వంటలను స్వామివారికి అర్పించారు. మందిర అధ్యక్షుడు చక్రధారిదాస్ వేణుధారిదాస్, బలరామ గోవిందదాస్, పీఆర్‌ఓ శ్యాంసుందర అచ్యుతదాస్ పాల్గొన్నారు.



నృత్యాలు ప్రదర్శిస్తున్న మహిళలు

– ఆటోనగర్(విజయవాడతూర్పు)

జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు

ఎ.కొండూరు: వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, ముఖ్యంగా జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు అన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆదేశాల మేరకు మండలంలోని ఎ.కొండూరు, పాత కొండూరు, గోపాలపురం గ్రామాల్లో శనివారం దోమల నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీల సహకారంతో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టామని, లార్వా నివారణకు దోమల మందు పిచికారీ చేయించామని చెప్పారు. ఫ్రైడేను డ్రై డేగా నిర్వహించాలన్నారు. ఇటీవల మృతిచెందిన ఆశా కార్యకర్త టి.రాధమ్మ కుటుంబాన్ని జిల్లా వైద్యాధికారి ఎం.సుహాసిని పరామర్శించారని, వారి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశామని, మరో రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మోతీబాబు తదితరులు

విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినులు

రెడ్డిగూడెం: మండల పరిధిలోని రంగాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు నలుగురు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయిని తబిత తెలిపారు. ఎస్.సిరి (నూజివీడు), పి.ప్రణీ్వ (శ్రీకాకుళం), ఎస్.స్వాపి (ఒంగోలు), సీహెచ్ వర్షిణి (ఒంగోలు) ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని చెప్పారు. వీరిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినులు, సిబ్బంది అభినందించారు.

వాహనాల తనిఖీ



వీరులపాడు: వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే చర్యలు తప్పవని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని జమ్మవరం గ్రామ సమీపంలో శనివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఆటోల్లో లౌడ్ స్పీకర్‌లు వినియోగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ముఖ్యంగా వాహనాలకు సంబంధించిన పత్రాలను విధిగా వెంట ఉంచుకోవాలన్నారు. రోడ్డు నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడిపి ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని సూచించారు. అనంతరం రికార్డులు సరిగాలేని పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు.

దమ్ము ట్రాక్టర్లతో రహదారులు ఛిద్రం





చెక్కపల్లిలో రహదారిపై తిరుగుతున్న దమ్ము చక్రాల ట్రాక్టర్, దెబ్బతిన్న రహదారి

పట్టించుకోని అధికారులు

ముసునూరు: దమ్ము ట్రాక్టర్ల ధాటికి కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారులు ఛిద్రమవుతున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ట్రాక్టర్లతో పొలాలను దమ్ము చేస్తున్నారు. ఇంటి నుంచే ట్రాక్టర్లకు దమ్ము చక్రాలు బిగించి రహదారుల మీదుగా పొలాలకు వెళుతుండడంతో దమ్ము చక్రాల ధాటికి రహదారులు దెబ్బతింటున్నాయి. రాళ్లు లేచిపోవడం, పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రహదారులన్నీ అధ్వానంగా మారుతున్నాయి. ఒక రోడ్డు పాడైతే దాని మరమ్మతులకు, కొత్త రోడ్ల నిర్మాణాలను కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించాల్సి రావడమే కాకుండా, ఈలోపుగా దెబ్బతిన్న రహదారుల వలన పలు ప్రమాదాలు సంభవించే ప్రమాదముంది. మండలంలో చెక్కపల్లి–లోపూడి, లోపూడి–గుళ్లపూడి, గుడిపాడు, గుళ్లపూడి–వలసపల్లి, వలసపల్లి–యల్లాపురం, యల్లాపురం–బలివే, ఆక్కిరెడ్డిగూడెం–గోగులంపాడు, లోపూడి– సూరేపల్లి, వలసపల్లి–రమణక్కపేటల రహదారులు మొత్తం 45 కిలోమీటర్లు పొడవునా ట్రాక్టర్లు దమ్ము చక్రాలతో నిత్యం తిరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లపై దమ్ముచక్రాలతో ట్రాక్టర్లను తిరగనివ్వకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

రహదారులు ప్రభుత్వ ఆస్తులు. వాటిని పాడుచేస్తే కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుంది. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రహదారులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవు. – పి.వాసు, ఎస్‌ఐ

పొలం పనుల్లో రైతులు జాగ్రత్తలు పాటించాలి

మైలవరం: పంట పొలాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ పి.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉంటారని, వర్షం పడేటప్పుడు పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లు తడిచి ఉంటాయని, మోటార్లు ఆన్ చేయవద్దని రైతులకు సూచించారు. వర్షాలకు నేల మెత్తబడి విద్యుత్ స్తంభాలు ఒరిగి పడే అవకాశం ఉందన్నారు. అటువంటి పరిస్థితులు ఉంటే వెంటనే విద్యుత్ శాఖాధికారులకు తెలియజేయాలని సూచించారు. వ్యవసాయ పనులు చేసే సమయంలో రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలని చెప్పారు.

నేడు గురుపూజోత్సవం

నూజివీడు: రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పీవీఎస్ఆర్ కల్యాణ మండపంలో గురుపూజోత్సవం నిర్వహిస్తామని ఖండకార్యవాహ పవన్ సూర్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక కరూర్ వైశ్యా బ్యాంక్ బ్రాంచి హెడ్ కేపీ వంశీకృష్ణ పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రధాన వక్తగా ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ శారీరక్ ప్రముఖ్ మారెళ్ల శంకర్ పాల్గొంటారని చెప్పారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ఆగిరిపల్లి: జీపీఎస్ చట్టాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగిస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయులకు గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ ఆ చట్టాన్ని కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఎస్టీయూ, డీపీఆర్‌టీయూ, యూటీఎఫ్ ఆగిరిపల్లి మండల శాఖల నాయకులు వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. ఉద్యోగుల ఆకాంక్షలను పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం జీపీఎస్ చట్టాన్ని కొనసాగిస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉద్యోగుల ఆకాంక్షను గుర్తించి పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని డీపీఆర్‌టీయూ ఆగిరిపల్లి మండల శాఖ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి వంశీ వశిష్ట, ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు వేణుగోపాలరావు, మండల కార్యదర్శి కొవ్వలి కోటమ్మ, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అజరయ్య డిమాండ్ చేశారు.

వాహనం ఢీకొని పాడిగేదె మృతి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుర్తు తెలియని వాహనం ఢీకొని పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన గుంటుపల్లిలో శుక్రవారం రాత్రి జరిగింది. సీఐ ఎం.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నలజాల రమేష్‌బాబు పాడిగేదెల పెంపకంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తనకు ఉన్న ఆరు గేదెలను రాత్రి సమయంలో ఇంటి వద్ద కట్టేసి నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారుజామున లేచి చూస్తే ఒక గేదె కనబడలేదు. ఐదు గేదెలు మాత్రమే ఇంటి ముందు ఉన్నాయి. గేదె కోసం వెతుకుతుండగా శ్యామ్ అనే వ్యక్తి రోడ్డుపై గేదె మృతి చెంది ఉందని తెలిపాడు. బాధితుడు ఆ గేదె తనదిగా గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొన్నట్లు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.